# వరద



"ఏంచేస్తున్నావ్"

భర్త సాంబయ్య అడగటంతో చేతిలో ఉన్న రూపాయలను డబ్బాలో వేసి వెనక్కు తిరిగి భర్తవంక చూసింది జానకి.

"నా కోసం ఎందుకు అలా డబ్బు కూడబెడ్తున్నావ్"

"నీవు అలాగే మాట్లాడుతావు. నీ జబ్బు నయం కావద్దా ఏంటి."

"నాకేం జబ్బు జానకీ.. పోయే కాలం దగ్గిరి కొచ్చింది. అందుకే ఇలా మంచాన పడ్డాను" తన స్థితికి తానే జాలి పడుకుతూ గొణిగాడు.

గబుక్కున జానకి పరుగెత్తుకుంటూ వచ్చి ఒక చెత్తో అతని నోరు మూసి అంది.

"అలా అనకండి... మీరు లేకుంటే మా బ్రతుకు ఏమవుతుంది. మిమ్మల్ని ఏలాగైనా బ్రతికించుకుంటాను" ఆవేదన గొంతులో ఉట్టిపడ్తుండగా అంది జానకీ.

"నీ పిచ్చికానీ నన్ను బ్రతికించుకొంటావి కి ఎన్ని వేలు కావాలో తెల్సా. పదివేలు. అన్ని వేలు నీకెక్కడి నుండి వస్తాయి."

"కూడ బెడ్తాను"

"ఎన్ని రోజులని... ఎన్నని... ఎలాగని..."

"ఏలాగైనా..." పట్టుదలగా అంది జానకి.

"నీకు నిజంగా పిచ్చిలేసింది."

"అవును పిచ్చే..." గొంతులో ఏదో అడ్డు పడ్డట్లుగా అంది జానకి.

* * * *

సాంబయ్య ఓ ఫ్యాక్టరీలో కార్మికుడు. క్యాన్సర్‌తో బాధపడ్తున్న వ్యక్తి. భార్య కంగారుపడి డాక్టర్‌కి చూపిస్తే డాక్టర్ ఆపరేషన్ చెయ్యాలన్నాడు. అందుకు పదివేలు అవుతుందన్నాడు. అప్పటినుండి పదివేల కోసం రోజు మిగిలిన రూపాయలను ఒక డబ్బాలో వేస్తోంది. తాను ఎన్ని వందల రోజులు వేసినా 10 వేలు కావని తెల్సినా అదో నమ్మకంతో ఆమె అలా వేస్తోంది — వాళ్ళుంటున్నది ఓ పల్లెటూర్లో.

* * * *

బట్టలు ఆరేస్తున్న జానకి దగ్గరకి వచ్చింది జానకి కూతురు— మూడు సంవత్సరాల దీప.

"ఏమయింది బడి కెళ్ళలేదా"

"ఉహు"

"ఎందుకు"

"పైసలు తీసుకురమ్మన్నాడు సార్"

"దేనికి"

తెలీదన్నట్లు చూసింది దీప

"సర్కార్ బడిలకు కూడా పైసలు కట్టాలా" అనుకుంది జానకి.

"రేపు ఇస్తానని చెప్పవే" చెప్పింది కూతురికి.

"కొడ్తాడు మాస్టారు" అంది దీప భయంగా

"వాడికేం పోయే కాలం" మనస్సులో అనుకుంది.

"డబ్బులు ఎలా" అర్థం కాలేదు ఆమెకు.

"డబ్బాలోంచి తీసి ఇద్దామా" అనుకుంది కానీ మనస్సు అంగీకరించలేదు.

చివరిగా బాధపడ్తూనే డబ్బాలోంచి తీసి యిచ్చింది.

ఆ రోజు— తాను రోజూ పనిచేసే ఇళ్ళలో కాక మరో ఇంటిలో పనిచేసి— డబ్బాలోంచి తీసిన పైసలకు సమానంగా పైసలు డబ్బాలో వేసింది.

* * * *

ఆ రోజు వాన ఉధృతంగా పడుతోంది.

బయట పడుతున్న వానను చూసి విసుక్కుంది జానకి.

"ఏం వానో ఏమో.. ఊరుకు ఊరు కొట్టుకుపోయేలా ఉంది"

జానకి మాటలకు చిన్నగా నవ్వి... దగ్గుతూ పక్కకు ఒత్తిగిల్లి పడుకున్నాడు సాంబయ్య.

భర్త వంక ఓసారి జాలిగా చూసి దీప పక్కన పడుకుంది జానకి.

* * * *

చల్లగా ఏదో తగిలినట్లనిపించటంతో లేచింది జానకి.

"హాహాకారాలు... అరుపులు వినపడ్తున్నాయి."

క్షణంలో గ్రహించింది— ఊరు వరద వచ్చి కొట్టుకు పోతోందని...

ఒక్క అడుగు పక్కకు వేసింది.

అంతే.

గుడిసెను ఏదో బలంగా తాకినట్టు గుడిసె ఊగిపోసాగింది. గుడిసె కూలిపోసాగింది.

కొద్ది క్షణాలవరకు ఆమెకు ఏం అర్థం కాలేదు.

కొద్ది క్షణాల తర్వాత తేరుకున్న ఆమె నీటిలో మూడొంతుల వరకు మునిగి ఉంది.

ఒక్కసారి కెవ్వున అరిచింది.

మరుక్షణం జ్ఞాపకం వచ్చారు భర్త, బిడ్డ.

"ఏరివాళ్ళు.." చుట్టూ చూసింది.

ఆ నీళ్ళలో నడుస్తోంది. కదులుతున్న చేతులకు ఏదో తగలడంతో పట్టుకొని తీసింది.

అది తాను భర్త కోసం డబ్బు కూడబెట్టిన డబ్బా.

భర్త లేడు— బిడ్డ లేదు అన్న విషయం ఆమెను కంగారు పెడ్తోంది.

"తన జీవితాధారం పోయింది. ఇక తానెందుకు"

హృదయం ముక్కలయ్యేలా ఏడ్చింది.

ఆమె కంటినుండి రాలిన కన్నీటి బొట్లు ఎన్నో ఆ వరదలో కల్సిపోయాయి.

"తన భర్త లేనప్పుడు— ఈ డబ్బు లెందుకు"

చేతిలోని డబ్బా దూరంగా విసిరేసింది.

కోపంగా—

నిస్సహాయంగా—

బాధగా—

## సి.హెచ్.వేణు